మా వారంటే, మా శ్రీవారంటే ఊరం తకి ఆ చుట్టు పూళ్ళకీకూడ మా మంచివారు.

"ఏమే పిల్లా! అబ్బాయి యింట్లో వున్నాడా?" అంటూ వస్తుంది ఒక అవ్వగారు. "కోడిజుసిల కొనుక్కు నెక్కడికి పంపావేం?" అంటూ వస్తాడొక అత్తగారు. "బావయ్య వున్నాడా?" అంటూ వాడొక తమ్ముడు. "అయ్యగారికోసం మొచ్చానమ్మా" అంటారు కొందరు పుత్రసమానులు... ఎందరు ఎన్ని విధాల. ఎన్ని పనులమీద వచ్చి పోతారో చెప్పలేను...

నిన్న తోముకోవానికి పేస్టుమీద మోజుపుట్టిన ఒక మామగారు "అల్లుడా! ఇంకా నిద్రలేవలా?" అంటూ వచ్చి, మావారి పళ్ళ గట్టితనం, తెల్లదనం చూసి. "నన్ను ఏ పుల్లతో పళ్ళు తోముకోమంటావూ?" అని సలహా అడుగుతాడు. యీయనే ఇంత పేస్టు పెట్టితేసరి. లేకపోతే "పట్నంనుంచి ఏదో జిగురు తెచ్చావంటగా! అది కాస్త యిట్టా పెయ్. నా పళ్ళకి ఏమన్నా పనిచేస్తుందేమో చూద్దాం" అంటాడు. తానేకొంగా పట్నం తెలిసిన మనిషినన్న ఆనందంతో శ్రీవారు ఇంత పేస్టు యిచ్చి "యిదేం భాగ్యమా! రోజూవచ్చి పట్టుకుపో. కొన్నాళ్ళు వాడిచూడు. బాగుంటే ఈసారి పట్నం వెళ్ళినప్పుడు ఒకటి తెచ్చిపెడతా" అనటంతో మామ ఆ రోజుకు ప్రొద్దు పొడుస్తుంది...

'అబ్బాయి కాఫీపొడుం పట్నంనుంచి తెస్తాడు. ఒక్కసారి ఆ పొడుంతో కాఫీ కాచాను. పిల్లలకి అదేం పాపం కావాలని కాచుకుంటారు... ఎప్పుడూ అదే గానే పదా? మావాళ్ళూ వున్నారు. ఎందుకు నాణ్యం తెయ్యటం బేరం చెయ్యటం. అబ్బాయిలాగా తెలివి తేటలు కావద్దూ" అంటూ వస్తుందొక బామ్మగారు మా వారేమో నన్ను ఒక కేకవేసి తన తెలివితేటలు తన చెవుల్తోనే వింటూ "ఆ కాస్త యేం బాగుటుంది యింకొస్త వెయ్యి డికాక్షన్ చిక్కగా వుంటేనే రుచి. దీనికిన్ ఫుంకెం పొయ్యరాదూ" అంటాడు. కొందరికి కాఫీయే యిప్పించి పంపిస్తారు.

పొరుగింటి మా యింటి యిడ్లీలు నోట్లో వేసుకుంటే వెన్నముద్దలా కరిగిపోతాయి. ఆ రవ్వ ఏమి రవ్వో. ఏ పట్నంనుంచి తెచ్చారో తెలుసుకోటానికివచ్చి. శ్రీవారి బలవంతంమీద యిడ్లీలు తినిపోతారు.

మా యింటి తలనూనె వ్రాసుకుంటే కొందరికి తిన్న తిండి బాగా జీర్ణమౌతుంది. కొందరికి మెదడు పని చేస్తుంది. కొందరికి బట్టతల మీద వెంట్రుకలు మొలుస్తున్నట్టే అనిపిస్తుంది. యిదంతా ఆ నూనెలో



కాదట. శ్రీవారి సెలెక్షన్‌లో వుందట.. ఆ ఒక్క మాటకోసం మా యింటి నూనె అంతా అయ్యి...

మా పిల్లలు వేసుకునే బట్టల కుట్టులో పవిత్రం వుందట. ఎంతమంచి గుడ్డలుయిచ్చినా, కుట్టేవాళ్లు పాడుచేసి పెడుతున్నారట. మావారికి చెపుతారు. బట్టలనీ పిల్లలనీ వెంటబెట్టుకొచ్చి ... శ్రీవారు నాకు అప్పగిస్తారు ఆ పని... "వాళ్ళోవాళ్ళ పిల్లల గుడ్డలన్నీ నేనెక్కడ కుట్టేదండీ" అంటే - "యిదిగో యింత మంచివాడికి యిలాంటి పెళ్ళాం దొరికిందేమా" అనుకుంటారట!

"అనుకున్నా మాదాగే..యిప్పుడు అనుకోటం లేదా!" అంటే —

అంతటో పోదట. "ఆలికి బాలివి మొగుడు" అని తనని అంటారట. తప్పేముంది "పతివ్రతలం గదా!

మా పిల్లకాయలకి స్కూలులో మంచిమార్కులు వస్తాయట. ఎంత డబ్బుపోసి పంతుళ్ళని పెట్టినా, చదువు రావటంలేదట. అందుకని దీపాలు పెట్టేవేళ కల్లా వరండా నిండా ఒక చిన్న స్కూలు తయారవుతుంది. ఆయనతో మాట్లాడ్డానికి అనేక మంది వస్తారు. ఆ స్కూలు పనికూడా నాకే మరి...

ఇలా రోజూ ఎన్నో. దినచర్యలో చివరి అంకంగా భోంచేసి పడుకోబోయే వేళకి ఊరికు ఆ చివరినుంచి ఓ తాతయ్య వస్తాడు. తాను కాశీ, రామేశ్వరం వెళ్ళిరావటం. కంచిలో బంగారుపుబల్లి, పక్షి తీర్థంలో పెద్ద గద్ద. మొన్న, నిన్న, ఈ రోజూ, రేపూ యికముందూ కూడా యివే చెపుతాడు. ఆయన ఎక్కిన రైలుబండి గురించి చెపుతూంటే ఆ చోద్యం మనంవింటూ ఊకొట్టాలి. ఊకొట్టకపోతే "నిద్రపోతున్నారా?" అని లేపుతాడు. "యిప్పటినుంచి నిద్రపోతే పక్కలు నొప్పి పుట్టవా" అంటాడు. అంత పూటలో ఆయన పక్క యింట్లోవాళ్ళు కూడా వినరు. మా మంచివారైన మావార్ని వెతుక్కుంటూవచ్చి అర్ధరాత్రి దాకా విని పించి. అప్పటికి పోతారు. ఆరోజుకు మాపని ముగుస్తుంది...

పెళ్ళయి కొత్తగా పట్నటూరుకి కాపురానికి వచ్చిన రోజులవి. ఎవరో బామ్మగారు నన్ను చూడ్డానికని వచ్చి, నా పెట్టెని చూసింది. "పెట్టె బాగుందిరా నాయనా, ఎక్కడ కొన్నావు. ఎంతకు కొన్నావు" అని అడిగి, "మాఅబ్బాయీ తెచ్చాడు ఓ పెట్టె. బోలెడంత డబ్బు తగలేశాడు ఎందుకూ?

## లక్ష్మి శివరాం

# మావారూ, శ్రీవారూ, మామంచివారు...

అందమా చందమా ?" అన్నది.

ఇంకేం శ్రీవారుదాన్ని మద్రాసు పోయినప్పుడు తెచ్చానని పదిహేనురూపాయలనీ, అన్నారు. బామ్మగారు "మావాడూ అక్కడే తెచ్చాడు. అంత తక్కువధర పెట్టాడేం" అన్నది.

ఇక యీయన మద్రాస్‌లో అంతా మోసమని ఎంతో తెలివి తేటలు లేకపోతే బేరం చెయ్యలేమనీ ఏమేమో చెప్పారు.

ఆవిడగారేమో "పదిహేను రూపాయిలిస్తాను గాని నాకో పెట్టె తెచ్చిపెట్టు నాయనా యిట్లాంటిదే" అన్నది.

ఈయన సరేనన్నారు.

నిజానికి ఆ పెట్టె కొన్నది నేను. ముప్పై రూపాయలు. ఈయనేమో ఒప్పుకున్నారు. అప్పటికి "ఆవిడ నిజంగా డబ్బుయిస్తుందా ? యీ పిడ తెస్తారా ?" అని వూరుకున్నాను.

కాని- శ్రీవారు బేరంలో యింత తెలివితేటలు గలవారని వూరంతా క్షణంలో పాకిపోయింది.

మరోవారం రోజుల్లోపల మామ్మలు, బామ్మలు, అత్తయ్యలు, మామయ్యలు, వదినెమ్మలు, అక్కచెల్లెళ్ళు యింటికి వరుసపెట్టి రావడం మొదలు పెట్టారు.

మద్రాస్‌లో "చల్ల చేసుకునే కవ్వపుగుత్తిచౌక" అట. "మద్రాస్ కత్తిపీటలు మహానాణ్యం" అట. ఒక చదువుకునే పిల్లకి మద్రాస్ గొడుగుమీద మహా మోజట. ఒక కుర్రాడు బాట్‌లు వూరికే విరగ్గొడుతున్నాడట. ఇనపకడ్డీలాంటి బాట్ కావాలట. మద్రాస్‌కి కంచి దగ్గరేనట, కనుక కంచి పట్టుచీరెలు, సముద్రపు గవ్వల్లో కాటుక పెట్టుకుంటే కళ్ళు చల్లగా వుంటాయట ! ఫాస్కులు, బైండు పుస్తకాలు, గాజులు. ఒకటా ? చివరకు ఒక పిన్నమ్మగారు అర్థమణుగు మిరపకాయలు మంచివిచూచి మద్రాస్‌నుంచి తెమ్మన్నారు.

వస్తువుల్లో అయితే రకరకాలు చెపుతున్నారు గాని, ధరలో మాత్రం అందరూ యిక్కడి ధర చెప్పి, మద్రాస్‌లో అంతకంటే ఐదో పదో చౌకగా వుంటాయని ఏకాభిప్రాయం వెలిబుచ్చుతున్నారు. తగ్గింపుధర ప్రకారమే కొందరు డబ్బు ఇస్తున్నారు. కొందరు "కాస్త అటూ యిటైతే తర్వాత చూసుకుందాం" అంటున్నారు. మరీ దగ్గరి వాళ్ల "తేరా నాయనా, డబ్బు తెచ్చాక యిస్తాంలే" అని ఒకరు అంటే "డబ్బు యివ్వకపోతే వాడు తేనన్నాడా యేం ?" అని మరొకరు అంటున్నారు.

"మద్రాస్‌లో అంత మంచి సరుకు యింత తక్కువ ధరకు ఎందుకిస్తారు ?" అన్న ఆలోచన ఒక్కరికీ రాదు.

నా భయంకొద్దీ నేను "అక్కడి వ్యాపారస్తులేం పిచ్చివాళ్ళా ?" అన్నాను. "అక్కడి వాళ్ల పిచ్చివాళ్లు కాదే అమ్మా ... యిక్కడ బేరంచేసే మేమంతా పిచ్చివాళ్ళం. అబ్బాయి చదువుకున్నాడు గనుక తెలివిగా బేరం చేస్తాడు. వాడి ముఖం చూస్తేనే వాళ్లు మోసం చెయ్యలేరు" అన్నది ఒకావిడ ...

శ్రీవారి ముఖం చూస్తుంటే "పాపం ! యిలాంటి ఆయన్ని నిజంగానే మోసం చెయ్యగూడదనిపిస్తోంది. కాని యిక్కడ వూరివాళ్ళే యిలా మోసం చేస్తుంటే-మద్రాస్ వాళ్ళెందుకు చెయ్యరూ అని కనిపిస్తోంది.

---

"అర్థ శాస్త్రవేత్త అంటే ఏమిటి ?"
"సంపాదించటంతప్ప డబ్బును గురించి సర్వ విషయాలూ తెలిసినవాడు"

---

"ఏమిటండీయిదీ, యిలా నెత్తిన పెట్టుకున్నారు" అంటే - "అబ్బ...నా తెలివితేటలమీద వాళ్ళకంత విశ్వాసముంది. దాన్ని చెడగొట్టటం మంచిది కాదు' అన్నారు.

నేనింకా యేదో చెప్పాలని ప్రయత్నించాను. కాని -"హుఁ ... వూళ్ళోవాళ్ళకి నా తెలివితేటలు కనిపిస్తుంటే, యిల్లాలికి నా తెలివితక్కువతనం కనిపిస్తోందాయె. ఖర్మ" అని నా నోటికి తాళం వేశారు.

మద్రాస్‌లో యివన్నీ కొనటానికి ఎంతదూరం తిరగాలో, టాక్సీలకి ఎంత అవుతుందో, ఎన్నాళ్ళు పడుతుందో తలుచుకుంటే నాగుండె పగిలిపోతుంది.

మరి నాలుగు నాళ్ళు గడిచాయోలేదో, అబ్బాయి మద్రాస్ వెళ్ళాడా ? ఎప్పుడు వెళ్ళాడు ? యింకా చాలారోజులు పడుతుందా ? పిల్లలు గోలచేస్తున్నారు మా అమ్మాయికి రోజూ గొడుగు కలలోకి వస్తుందట. అమ్మాయిని కంచిపట్టు చీరెకట్టి మరీ అత్తగారింటికి పంపాలంటున్నారు వాళ్ళ నాన్న...

ఇలా మళ్ళీవచ్చి పోతున్నారు. కొందరికి యిచ్చినడబ్బు ఖర్చుపెట్టుకోలేదుగదా అని అనుమానాలు...పర్వాలేదులే అని భరవాసాలు...

నిజంగా ఆయనకి మద్రాస్ వెళ్ళేపనేలేదు. అయినా యిప్పుడు తప్పనిసరయింది.

మా మేనత్తకూతురు మద్రాస్‌లో వుంటోంది. దానికి పిల్లవాడు బుడితే ఆ సంగతి తెలియజేసింది. యికనేం "బారసాలకి వెళ్ళకపోతే ఏం బాగుంటుందీ అని మొదలెట్టారు." అయినా వెళ్ళవలసింది నేను. నాకు పట్టని ఛట్టరికం ఆయన పట్టించుకుని తానే బయలుదేరి, నాలుగొంపలు అప్పుజేసుకుని తిప్పలుపడి, అన్నీ కొనుక్కొచ్చారు. మరచిపోయినవి ఏవైనావుంటే తెనాలిలోనేకొని మద్రాస్‌వని చెప్పి, పేరు నిలబెట్టుకున్నారు. ప్రస్తుతం ఆ వూళ్ళో లేంగనుక, కొంత మెరుగు. అయినా - యిప్పటికిమాత్రం తిప్పలు తప్పుతున్నాయా ?

ఒక్కసారి మంత్రి చేసినవాళ్ళు అది పోకుండా వుండటానికి తిప్పలు పడుతున్నట్టే, శ్రీవారుకూడా వచ్చినపేరు పోకుండా మహా అవస్థలు పడుతుంటారు.

మీ రెప్పుడన్నా మా ప్రదేశానికివస్తే, పనిబడి నాలుగురోజులు వుండాల్సివస్తే మా యింటికి రావచ్చు. శ్రీవారు అన్ని వస్తువులూ చూపిస్తూ "ఎలావుంది ? ఎలావుంది ?" అంటుంటారు.

"బాగున్నది" అనండి. "ఎంత ధర చేస్తుందంటావ్ ?" అంటారు. రెటింపు ధర చెప్పెయ్యండి. "అహహహా ... నేను దీన్ని యింతకే కొన్నాను. బేరం చెయ్యటంలో వుంది అసలు కిటుకు. నన్ను ఎవ్వడూ మోసం చెయ్యలేడు" అంటూ మిమ్మల్ని నాలుగుకు నాలుగు ఎనిమిది రోజులు యింట్లో పెట్టి రాజభోగంగా జరిపిస్తారు ! బజార్లోనుంచి చాటుగా పనసకాయ కొనుక్కొచ్చి 'మా తోటలోనించి విన్ననే మాఅన్నయ్య పంపా" డని మీకు యిచ్చి పంపుతారు...

పొరపాటున, ఆయన తెలివితక్కువ వాడన్నట్టుగా ధర తగ్గించిచెప్పారో, మీరు ఎంత స్నేహితులయినా, బంధువులయినా గుమ్మందాటి పోయేదాకా వూరుకోరు....

అలాంటి మనిషితో ఎలా వేగుతున్నా వంటారేమో ! భార్యాభర్తలం...ఒకళ్ళ తప్పులు ఒకళ్ళం సర్దుకుపోవాలి గదా !

కాకపోతే, యింత చెప్పికూడా మా వారైన మా మంచి శ్రీవారు ఎవ్వరో మీకు చెప్పను.

చెపితే, మీరు వచ్చి యింట్లో కూర్చుంటే...?

★

మన ఆనందమునకు పరమావధి పూర్ణారోగ్యము. నిరోగమయిన శరిరము ఆనంద నిలయము. వ్యాధిని ప్రేరేపించు శక్తులు అనంతము-వాటితో పోరాడి గెల్చుటకు
అంబేశ్వర ఆయుర్వేద ఫార్మశీ (రిజిష్టర్డు)
హెడ్డాఫీసు : మారుటేరు, ప.గో. జిల్లా, (ఆం.ప్ర)
వారి మందులు పూర్తిగా ఆధారపడదగినవి. వెంటనే వ్రాసి సుఖింపుడు.